క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



అథ్లెటిక్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ సాంబశివరావు

దొనకొండ: క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ముందుండాలని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి అథ్లెటిక్ పోటీలను ఆయన ప్రారంభించారు. మండలంలోని 8 పాఠశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు బి.మురళితెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈఓ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో అథ్లెటిక్ పోటీలు జరిగాయి.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనార్టీ డిగ్రీ విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నానీ కోరారు. నూతనంగా చేరిన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత పత్రాలు కళాశాలలో ఇవ్వాలని ఆయన కోరారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కురిచేడు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 100 మందికి మధ్యాహ్న భోజనం కోసం లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం 100 ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు వస్త్రాంనాయక్, సుబ్బారావు, ప్రధానోపాధ్యాయురాలు కె.హిమజకుమారి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ వీవీ రమణారావు, కార్యదర్శి రామారావు, మండల అధ్యక్షుడు ఐవీ నర్సిరెడ్డి, కార్యదర్శి వై.రంగ నాయకులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న సాయిబాబా

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరం సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి శంకర్ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకం అలంకరణ చేశారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మండల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. క్రీడలను ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ ప్రారంభించారు. తొలుత వారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. హెచ్ఎం హేమ్లా నాయక్, పీడీలు మత్తయి, రాజు, వెంకటేశ్వర్లు, నిహారిక, ఉపాధ్యాయులు గాలయ్య, ఏసానాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత్రికేయులపై అక్రమ కేసులు అన్యాయం



తాళ్లూరు: పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పత్రికలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు. ప్రజల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికా వ్యవస్థ ముందుంటుందని గుర్తు చేశారు. జర్నలిస్టులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తేసి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పోశం విజ్ఞప్తి చేశారు.

దొనకొండలో అటకెక్కిన అభివృద్ధి

- దొనకొండ మండల పరిషత్‌లో కోటి రూపాయల నిధులు నిల్వ
- అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న కూటమి నాయకులు
- పట్టించుకోని వివిధ శాఖల అధికారులు



దొనకొండ ఎంపీడీఓ కార్యాలయం

దొనకొండ: మండల ప్రజా పరిషత్‌కు 2024–25, 2025–26 సంవత్సరాలకు గ్రామాల అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. రెండేళ్ల నుంచి అభివృద్ధి పనులు చేయక నిధులు పేరుకుపోయినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ నిధులతో ఎంపీటీసీల ద్వారా గ్రామాల్లో పారిశుధ్య పనులు, సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు, తాగునీరు తదితర ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తమదని, ఆ నిధుల్లో 70 శాతం పనులు తాము చేసుకోవాలని కూటమి నాయకులు అడ్డుపడుతున్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులకు పనులు అప్పగించేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ మౌనం పాటించారు. ప్రస్తుతానికి ఆయన ట్రినింగ్‌లో ఉండటంతో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎస్‌వీండీ దావూద్ బాధ్యత వహిస్తున్నారు. మండలంలో 14 ఎంపీటీసీలకు గాను ఒక ఎంపీటీసీ మాత్రమే టీడీపీ, మిగిలిన వారు వైఎస్సార్ సీపీ. 2024 ఎన్నికల్లో పోలేపల్లి, కొచ్చెర్లకోట, గంగదేవిపల్లి, మల్లంపేట ఎంపీటీసీలు టీడీపీకి మద్దతిచ్చారు. దీంతో 9 మంది వైఎస్సార్ సీపీ, ఐదుగురు టీడీపీ ఎంపీటీసీలు ఉన్నారు. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఎంపీటీసీల పదవీ కాలం ముగియక ముందు గ్రామాల్లోని అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిధులకు అడ్డంకి సృష్టించడం సరికాదు: మండల ప్రజా పరిషత్‌లో సుమారు కోటి రూపాయల నిధులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ నిధులతో గ్రామాల అభివృద్ధి చేసేందుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. మండల ప్రజా పరిషత్ గ్రాంట్ గ్రామాల అభివృద్ధికే వాడుకోవాలి. కూటమి నాయకులు సహకరిస్తే నిధులు ఎంపీటీసీలకు కేటాయించి త్వరలో గ్రామాల అభివృద్ధి చేపడతాం.
– బొరిగొర్ల ఉషామురళి, ఎంపీపీ, దొనకొండ



నిధులిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం
రెండేళ్ల నుంచి మా గ్రామంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నేను ఎంపీటీసీగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు చేయలేకపోతున్నా. మా గ్రామానికి నిధులు కేటాయించండి. అభివృద్ధి పనులు చేసుకుంటానని సర్వసభ్య సమావేశంలో అధికారులను అడిగా. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. నిధులు వెనక్కి వెళ్లిపోతాయి. అభివృద్ధి నిలిచిపోతుంది.
– బందారు చిన్న గురవమ్మ, ఎంపీటీసీ, చందవరం



బొద్దికూరపాడులో యూరియా కోసం గుమిగూడిన రైతులు

యూరియా కొరత తీరేదెన్నడు?

తాళ్లూరు: జిల్లాలోనే తాళ్లూరు మండలం వ్యవసాయ రంగంలో ముందు వరసలో ఉంటుంది. మండలంలోని బొద్దికూరపాడులో ఏటా అన్నీ సీజన్లో అధిక సంఖ్యలో రైతులు పంటలు సాగు చేస్తుంటారు. పంట సాగుకు సరిపడా యూరియా దొరకడం లేదని రైతులు ప్రస్తుతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల క్రితం 6 టన్నుల యూరియా సరఫరా చేశారని, గురువారం 12 టన్నుల యూరియా రైతు భరోసా కేంద్రానికి సరఫరా చేశారన్నారు. ఆర్‌బీకే సరఫరా చేసిన యూరియా కొంతమంది రైతులకు అందలేదు. దీంతో చేసేది ఏం లేక నిరాశతో రైతులు వెనుదిరిగారు. పంటల సాగుకు సరిపడా యూరియా అదించడం లేదని రైతులు వాపోతున్నారు. పంట వేసిన ప్రతి రైతన్నకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎరువులు సరఫరా చేసి గిట్టుబాటు ధర కల్పించి రైతేరాజుగా నిలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వనే లేదు. దీనికి తోడు ఎరువుల కొరత ఉందంటున్నారు. మరీ ముఖ్యంగా యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు సాగు చేసిన పంటకు సరిపడా యూరియా అందించాలని బొద్దికూరపాడు రైతులు కోరుతున్నారు.

326 మంది మహిళలకు వైద్య పరీక్షలు



కురిచేడు: మాట్లాడుతున్న డాక్టర్ రవితేజకుమార్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి

కురిచేడు: 'స్వస్త్ నారీ సశక్త పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో ఒక్కో రోజు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 326 మంది మహిళలకు అన్ని రకాల పరీక్షలు, 14 రకాల సేవలు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వి.రవితేజకుమార్, డాక్టర్ ఎం.సుస్మిత రెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

తాళ్లూరు: క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎస్.సత్యం, జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి అన్నారు. స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్లో గురువారం మండల వైద్యాధికారులు స్వస్తనారీ–స్వశక్తి పరివార్ అభినయ్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చార్లెస్ సర్జన్ పాల్గొన్నారు.

బొప్పాయిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి: బొప్పాయిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ సైంటిస్ట్ ఎం.రవీంద్రబాబు సూచించారు. మండలంలోని వెంకటాచలంపల్లి, చందలూరు పరిసర ప్రాంతాల్లో బొప్పాయి తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ బొప్పాయిలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ, తెగుళ్ల యాజమాన్యం, పురుగు మందుల పిచికారీ విధానాలు, కాయకోత, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. బొప్పాయిలో కాండం మొదలు, కాండం కుళ్లు, వైరస్ తెగుళ్ల అధికంగా ఆశించి బొప్పాయి దిగుబడిని తగ్గిస్తాయని చెప్పారు. కాండం కుళ్లు తెగులు వచ్చిన మొక్కల్లో కాండం మెత్తగా మారి కుళ్లిపోతాయన్నారు. వైరస్ తెగుళ్ల నివారణకు వైరస్ వాహకాలైన తెల్లదోమ, పేనుబంకలకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యాన శాఖాధికారి ఎం.రవి వెంకన్నబాబు మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా పలు రాయితీలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, అందరూ వినియోగించుకోవాలని కోరారు. నీటి కుంటలు, ప్యాక్ హౌస్, సోలార్ డ్రైయర్స్, మల్చింగ్ అందుబాటులో ఉన్నాయని సూచించారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కురిచేడు: దర్శిలో నవంబర్ 7,8,9 తేదీల్లో జరిగే సీఐటీయూ 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు కోరారు. జిల్లా మహాసభల కరపత్రాలను స్థానిక పీహెచ్‌సీ వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో 'ఐక్యత–పోరాటం' నినాదంతో ఏర్పడిన సీఐటీయూ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పోరాడుతోందని తెలిపారు. భవిష్యత్ పోరాటాల కోసం కార్మిక, ఉద్యోగులను ఐక్యం చేసే క్రమంలో జరిగే మహాసభల్లో కురిచేడు మండలంలోని కార్మికులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల కోసం పోరాడుతున్న సీఐటీయూకు మండలంలోని ఉద్యోగులు, కార్మికులు, ఉద్యమాభిమానులు ఆర్థికంగా, హార్థికంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే గౌసియా, అంజలి, నాగమణి, నాగేంద్రం, పంచాయతీ వర్కర్స్, నాయకులు ఎల్.అశోక్‌కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు కేవీ పిచ్చయ్య పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరికీ 12వ పీఆర్‌సీ అమలు చేసి జీతం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు ఒప్పంద కార్మికులు 12వ పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. 11వ పీఆర్‌సీ గడువు పూర్తయి 2 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు 12వ పీఆర్‌సీ కమిటీని వేయలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. వీరితోపాటు పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు చెల్లిస్తూ.. వీరికి మాత్రం రూ.13 వేలలోపు విదిల్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 23న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, హరి, చెన్నరాయుడు, చెన్నకేశవులు, శేషిరెడ్డి, కనకయ్య, అల్లూరయ్య, శేఖర్, ఇమాంసా, శ్రీను, సమ్మద్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని బస్సు సర్వీసులకు సంబంధించి సూచనలు, సలహాలు, ఇతర సమస్యలను డీఎం దృష్టికి తీసుకరావచ్చని పేర్కొన్నారు. సాయంత్రం 4–5 గంటల మధ్యలో 99592 25700కు ఫోన్ చేయాలని సూచించారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

యర్రగొండపాలెం: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 20వ తేదీన స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో జరుగుతుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అడహక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, ఎం.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. ఎంపికలో అండర్–14, 16 విద్యార్థినీ, విద్యార్థులు, అండర్ 18, 20 యువతీ, యువకులు పాల్గొనవచ్చని చెప్పారు. ఎంపికైన అథ్లెట్స్ ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనే అథ్లెట్స్ జనన ధృవీకరణ పత్రం, 10వ తరగతి మార్కుల లిస్ట్, ఆధార్ కార్డ్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు ఆ రోజు ఉదయం 8గంటల్లోపు 300 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 76750 26220, 99081 69358 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ముట్లవాగు



యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి మండలంలోని వీరయపాలేనికి సమీపంలో ఉన్న ముట్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం అటవీ ప్రాంతంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు అక్కడక్కడా ఉన్న నీటి కుంటల్లో నీరు చేరింది. వాగుల్లో చేరిన నీరు ప్రవహిస్తూ ముట్లకాలువ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రవహిస్తోంది. ఈ నీరు రాళ్లవాగులో చేరి అక్కడి నుంచి యర్రగొండపాలెం పెద్ద చెరువుకు చేరుతుందని, దీంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని ఆయా ప్రాంతాల రైతులు తెలిపారు.

కెరీర్ అండ్ మెంటల్ హెల్త్‌పై అవగాహన

కొనకనమిట్ల: కెరీర్ అండ్ మెంటల్ హెల్త్‌పై మండలంలోని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ గుమ్మా పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మనో వికాసం పెంపొందించేందుకు మెడిటేషన్, యోగా, ఫిజికల్ యాక్టివిటీస్, సోషల్ కమ్యూనికేషన్, సెల్ఫ్ డిసిప్లిన్, నైతిక విలువలు, అగ్రెసివ్ బిహేవియర్, మొబైల్ ఫోన్ అడిక్షన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజ్ పోరును విజయవంతం చేయాలి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంలో శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని స్థానిక ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి ఉన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దర్శి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి వప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంలో శుక్రవారం జరిగే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ ఇరుగుల శ్రీనివాసరెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డిలు కోరారు. ఉదయం 7 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బయల్దేరి మార్కాపురం చేరుకుంటారన్నారు.

పుల్లలచెరువులో భారీ వర్షం



దర్శిలో కురుస్తున్న వర్షం

పుల్లలచెరువు: మండలంలో గురువారం పగలంతా విపరీతంగా ఎండకాయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నాలుగు గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మబ్బులు కమ్ముకుని గంట పాటు పుల్లలచెరువుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు మిర్చి మొక్కలు, మొక్కజొన్న విత్తనాలు నాటారు. ఇటీవల ఎండలకు మొక్కలు వాడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. గురువారం కురిసిన వర్షంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకున్నారు.

దర్శి: పట్టణంలో గురువారం వర్షం సుమారు రెండు గంటల సేపు దంచి కొట్టింది. దర్శితో పాటు గ్రామాల్లో కూడా భారీ వర్షం కురిసింది. ఈ వర్షం మెట్ట రైతులకు ఉపయోగం. ఇప్పటి వరకు పదును కాని పొలాలు కూడా పదునై రైతులు వ్యవసాయ పనుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. పట్టణంలోని కాటేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టణంలో రోడ్లు జలమయమయ్యాయి.

దరిమడుగులో పోలేరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి



అమ్మవారికి పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

మార్కాపురం: మండలంలోని దరిమడుగు గ్రామంలో పోలేరమ్మ తల్లి దేవస్థానంలో పోలేరమ్మకు మహాలయ మాసం సందర్భంగా గురువారం భక్తులు కుంకుమ బండ్లు కట్టి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్



కంభం : పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు



ఖోఖో ఆడుతున్న బాలికలు



హోరాహోరీగా బాలికల కబడ్డీ పోరు



గొట్లగట్టులో కబడ్డీలో తలపడుతున్న బాలికలు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడల పోటీలు రెండో రోజు గురువారం హోరాహోరీగా సాగాయి. పరుగు పందెం బాలికల విభాగంలో రావిపాడు, టెన్నిస్‌లో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. మండల స్థాయి విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ అబ్దుల్ సత్తార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సుబ్రహ్మణ్యం, బషీర్, వెంకటేశ్వర్లు, మధుసుదన చారి, శ్రీనివాసులు, జయమ్మ, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ కామూరి అమూల్య ప్రారంభించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, మొబైల్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను బుధవారం గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల, వెలుగొండ గురుకుల పాఠశాల మైదానంలో ప్రారంభించారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, చినారికట్ల, పెదారికట్ల, మర్రిపాలెం, రేగడపల్లి, గొట్లగట్టు కేజీబీవీ నుంచి విద్యార్థులు పాల్గొనగా వారికి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాట్‌మెంటన్, యోగా, చెస్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీలలో ఆయా పాఠశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఎంఈఓ–2 నరసింహారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ, పలు పాఠశాలల పీఈటీలు ఉప్పుటూరి శ్రీనివాసులు, సుఖునాభి, వనజలత, పెద్దన్న, పాఠశాల కమిటీ సభ్యులు పరిటాల సుబ్బయ్య, పొదిలి తిరుపతయ్య, వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక అభివృద్ధి

బేస్తవారిపేట: క్రీడలతో శారీరక అభివృద్ధితోపాటు మానసికాభివృద్ధి జరుగుతుందని ఎంఈఓలు ఎస్.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో క్రీడా పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పీవీ రమణారెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.